# యజ్ఞ పశువు

ఎమ్మే ఫస్టున ప్యాసయిన సుందరం వూళ్లో వూరికనే తిరుగుతున్నాడు. వూరికనే తిరుగుతున్న సుందరాన్ని గురించి ఆవూరి మేలుకోరే పెద్దలకు వివిధాభిప్రాయాలున్నాయి. ఈ అభిప్రాయాన్ని గురించిన అభిప్రాయాలు సుందరానికున్నయి.

"నిక్షేపంలాంటి పిల్లవాడు- పాపం- వుద్యోగం దొరక్కుండా వుంది." పాపం వినబడేట్టు అనుకుంటున్న దావిడ.

తడిగుడ్డతో తలుపు వేయబోతున్న ఆ విధవావిడ- పాపం స్వవిషయం మరిచి దారేపోతున్న తనలాంటివారిమీద సానుభూతి చూపించటం అంత సబబుగా లేదనుకున్నాడు సుందరం.

'మన సుందరాని కేం వుద్యోగం దొరికినట్టు లేదే, ఖాళీగానే తిరుగుతున్నాడూ?' అన్నాడాయన, కట్టువేసుకు కూచుని అరచేతిలో పొడుం దులుపుకుంటూ.

ఈయన గవర్నరు జనరలుకు సలహాదారుగా పోతే బాగుండునని అభిప్రాయపడ్డాడు సుందరం.

'ఒరేయ్ సుందరం, మావాడు సెక్రెటేరియట్లో వున్నాడని నీకు తెలుసుగా? నువు ప్రయోజకుడ వవుతావని నాకు తెలుసు. పెద్దతనం వచ్చిందిగాని కొంచెం మధ్యమధ్య నీ విషయం జ్ఞాపకం చేస్తుండూ?" ఆప్యాయంగా అన్నాడు సూరయ్యగారు.

ఏణ్ణర్థంనుంచి సూరయ్యగారు తనకీ విధంగా జ్ఞాపకం చేస్తున్నా, ఏరోజు కారోజు కొత్తగా భావిస్తున్న తను, సూరయ్యగారు యీ మాటలు ఎప్పుడు వుచ్చరిస్తున్నా, అమాంతం ఆయన్ని కౌగిలించుకుని ప్రేమకొద్దీ ఆయన మీసాలు దువ్వుతూ సర్వదా ఆయనకు కృతజ్ఞుడనని చెప్పుకుందామనే అభిప్రాయాలున్నయి సుందరానికి.

"పాపం వాళ్ల నాయన పిల్లవాణ్ణి దరిద్రుణ్ణి చేసి పోయినాడు గదుటే సుందరాం!" అని ఆవిడ ఆవిడతో అంటున్నది.

ఇలాంటి మాటలూ వినిపించుకునే సుందరానికి వెంటనే ఆ తాలూకు ప్రాణుల రెండు కొప్పులూ పట్టుకుని ఢీకొట్టించే వూహలు కలిగేవి.

'అయినా మన సుందరానికి కళ్ల కద్దుకుని అయిదారువేల కట్నంతో పిల్లని యిస్తారు' అనుకుంటున్నారు, ఆ ముత్తయిదువులు నలుగురు.

కట్నాలను గురించి ఏ అభిప్రాయాలూలేని సుందరానికి ఆశ్చర్యం కలిగించేట్టు పై అభిప్రాయాలు ఎబ్బెట్టుగా అనిపించినట్టుగానే వుండేది కాదు.

ఆ మాట కొస్తే లోగడ సుందరానికి నాలుగైదువేలు ఖరీదుచేసే పిల్లలతో ఆ తాలూకు తల్లిదండ్రులు పెళ్ళివిషయమై ప్రాధేయపడటాలు జరగలేదనుకోటం పొరబాటు. 'ఏమిరా నాయనా' అని ఆ సందర్భాల్లో అమ్మ సుందరం కెల్లి చూసింది కూడా. అదే సమయంలో ఎందుకో మనస్సు చికాకుగా– కట్నం అనే ముక్క చెవిని పడకూడదనే సుందరం అభిప్రాయం– వుండి, ఆ చికాకుదృష్టితోనే ఆ పెళ్ళికూతుళ్లు కొంచెం నల్లనల్లగా వున్నట్టు అనుకున్న సుందరం తనకు పూజ్యురాలైన అమ్మ యిష్టతను ఆ సందర్భాల్లో నివారించకపోలేదుకూడా.

సుందరం దరిద్రుడు. తనతోపాటు అసంఖ్యాకులుగా దరిద్రులున్నట్టు సుందరం నమ్మడు. కూలివాడు కనీసం రోజుకు ఒకటిన్నరో రెండో సంపాదించుకుంటాడు. ఒకవేళ సంపాదించుకోకపోయినా వాడికి సిగ్గూ బిడియాల్లేవు. ఆకలితో ఆ రోడ్లపక్కన నిశ్చింతగా పడుకుని నిద్రపోగలడు. రైతులు రైతు పడుచులతో పాటలు పాడుకుంటూ, సరసాలాడుకుంటూ ఆ పచ్చటి బంగారపు పొలాల్లో ఆనందంగా జీవిస్తారు. ఆముదప్పుచ్చూ, ఆముదప్పుచ్చు లేకపోతే గొర్రెపెంటా, గొర్రెపెంట లేకపోతే బర్రెపేడా, బర్రెపేడ లేకపోతే పందిపెంటా ఏ ఎరువు వేసయినా పంటలు పండించుకుంటారు. అసలు పంటలే పండకపోతే గాదెల్లో ధాన్యాలుంటయి వాళ్ళకు. వాళ్లు ప్రకృతి పురుషులు. కోమటి కొట్టు పెట్టుకు బతుకుతాడు. బ్రాహ్మణీకం వున్న బ్రాహ్మణుడు బ్రాహ్మణీకంతో బతుకుతాడు. తనబతుకు నడమంత్రపు బ్రతుకు.

ఇంతకూ తన కదృష్టం లేదు. తప్పు తనది కానేకాదు– వీరేశలింగం అన్నట్లు బహుశ సంఘానికి యిందులో కొంతభాగం వుండవచ్చు. ఎవళ్ళకు వాళ్లు బాగా బతుకుతున్నందువల్లే తన విషయం యీ సంఘీయులు పట్టించుకుంటున్నట్టు లేదని కొంత అనుమానానికి తావు లేకపోలేదు. అదే నిజమయితే యిలాంటి చచ్చు సంఘాలతో దేశం చీడపట్టిపోయే అవకాశం వుంది. దేశం మూలంగా సంఘాలు చీడపట్టి వుంటాయనేది వట్టిమాట. అదే నిజమయితే వీరేశలింగం నిష్ప్రయోజకు డన్నమాటే.

స్వాతంత్ర్య దినోత్సవాల్లో రైలుపెట్టెలమీదనెక్కి వుత్సవాల్లో పాల్గొన్న సుందరానికి యీ మధ్యనుంచి పేపర్లను చూస్తుంటే చెమట పోస్తున్నది.

నాలుగున్నర యింటర్వ్యూలకు వెళ్ళి – అర యింటర్వ్యూలో అరంగుళం పొట్టయిన సుందరం టిక్కెట్టులేకుండా రైలెక్కి వచ్చాడు– 'ఇన్ ద్యూ కోర్సు' అనిపించుకుని ఏణ్ణర్థం ట్యూషన్లు చెప్పి చూశాడు సుందరం. ఏణ్ణర్థం తరువాత ద్యూకోర్సు పర్మనెంటుకోర్సు అవుతుందని వొప్పుకునే టైములేదు సుందరానికి.

ఈ సమయాల్లో సుందరానికి మధ్యమధ్య లలిత ప్రత్యక్షమౌతూంటం అంత మంచిగా వుంటంలేదు. ఆనాడు – వాసన భరించలేకనే – అయినా యింతకన్న పోయిం దేముందని కాఫీ హోటలుకు వెళ్ళికూచుంటే ఒక మంచినీళ్ళ గ్లాసూ, యింకొక పింగాణీ కప్పూ, దాని తాలూకు సాసరూ చెయి విసుర్లో గచ్చుమీదకు జారటంవల్ల, అయ్యరు ఏదో అంటున్నా వినిపించుకోకుండా సర్వర్లతో పాటు అయ్యరును పక్కకు నెట్టుకుంటూ వచ్చి ఏటివొడ్డున కూచున్న సుందరానికి లలిత ప్రత్యక్షమయింది.

అసలు ఆడవాళ్ళను గురించి ఎలాంటి మీమాంసల్లోకి దిగని సుందరానికి లలితను గురించి కొంచెం తీవ్రంగా ఆలోచించవలసిన అగత్యం ఏర్పడింది.

లలిత అందచందాలు చదువు సంధ్యల్ని గురించి తనకేవిధమైన ఆక్షేపణలులేవని ఆరంభంలోనే చెప్పుకున్నాడు సుందరం. అందుకనే గాబోలు ఆ నలుగురు ముత్తయిదువులూ 'యీడూ జోడూ చక్కగావుంది'... అని అంటుంటే తనకు వినబుద్ధి పుట్టింది!

తను లలిత పెళ్ళి సమస్యను గురించి లోగడ పడ్డ బాధలను గుడ్ల నీరు కుక్కుకుంటూ దరిద్రులయిన ఆ దంపతులు కాళ్లు పట్టుకోవటమే తరువాయిగా ప్రాధేయపడుతుంటే నీరుకారిన సుందరం ఆ ఆవేదనలోనే పెళ్ళికి ఏ ఆటంకాలు లేవని లలిత హృదయాన్ని ఆనందపెట్టినందుకు గర్వించాడు. వెంటనే తన అమ్మ తలపు వచ్చి సుందరానికి తనను గురించి తనకే ఆశ్చర్యం కలగకపోలేదు.

"ఏమంటావమ్మా?" అమ్మనడిగాడు సుందరం లలితను గురించి.

"పిల్లకేమిరా నాయనా, సీతమ్మ తల్లిలాగుంది! వాళ్ళ అభిప్రాయాలేమిటో తెలుసుకోవద్దుట్రా సుందరం?" లలిత తల్లిదండ్రులను గురించి విచారించింది అమ్మ.

"వాళ్ళందరికీ యిష్టమే నమ్మా."

"ఇంకా ఎన్నాళ్ళురా చిన్నతనం సుందరీ! అల్లుడి ముచ్చట్లు గురించి అనుకోమట్రా నాయనా?"

"వాళ్ళేం అంత వున్న వాళ్లు కాదమ్మా" అంటున్న సుందరం గొంతు బిగదీసి నట్టయింది.

'అట్లా అనకమాకరా సుందరీ. అయ్యో పిచ్చి తండ్రీ వాళ్లుమటు కేం ముచ్చట్లు తీర్చుకోకుండానే పెళ్లి చేస్తారుట్రా!"

"శక్తి లేదన్నా రమ్మా."

"అయ్యో పాపకర్మం! ఎక్కడన్నా కద్దుట్రా యీ అపచారం! మన ఆచారాలే మంటపెడతావుట్రా నా పిచ్చితండ్రీ. నా కేమన్నా కట్నాల మీద మోజా మట్టిగడ్డలా! అయినా యింత అయోమయమేమిట్రా సుందరీ? ఎంతయినా యీ ప్రాణికి నువ్వే కదా–"

"నువు తప్ప నాకుమటు కెవ రున్నారమ్మా–"

"నా తండ్రీ! ఆయన ఎప్పుడో లేకుండా చేసిపోయినాడు గదా? ఆయన కేం మహరాజు–"

"వూరుకో అమ్మా–"

"అయ్యో శ్రీరామచంద్రమూర్తీ – అట్లాగేలే తండ్రీ– పిచ్చిముండను ఏదో వాగుతుంటాను – నాయనోయ్ సుందరీ, కాస్త నలుగుర్లో చెప్పుకునేట్లు యీ ప్రాణిని సంతోష పెట్టావా! నా కదే పదివేలు; ఆ మహారాజులేని లోపమూ తీరుతుంది. లోవరు సెకండ్రీ చదువుతున్న ఆ నరసమ్మ కొడుక్కి ఆరువేలిచ్చి నిక్షేపంగా పెళ్ళిచేస్తుంటే యిట్టే ముచ్చటేసింది. నరసమ్మ బతుకుకన్న తీసిపోయిన బతుకట్రా నాది సుందరీ? మరీ అబ్బరంగాని– ఆ మాత్రమన్నా లేంది ఆడపిల్లల పెళ్లిళ్లు జరగవని వాళ్ళకుమటుకు తెలియదూ! రేపు వాళ్లబ్బాయి పెళ్ళికి మహచక్కగా అన్ని ముచ్చట్లూ తీర్చుకుంటారు."

"వాళ్ళబ్బాయి కట్నం తీసుకోకుండానే పెళ్ళి చేసుకున్నాట్టమ్మా."

"మరీ విచిత్రంరా నీదీ! అయ్యో రామ, నీకూ నాకూ తెలియనిస్తారుట్రా పిచ్చినాయనా!"

"ఎట్లాగమ్మా–"

"ఏమిట్రా సుందరీ?"

"మాట యిచ్చానమ్మా–"

"అయ్యో వెర్రితండ్రీ, చిన్న కుంకవు నీకేం దెలుసురా మాట యివటానికీ– అయినా ఇదేం పాపకర్మం మరీనూ! వాళ్ళకేం పెద్దా చిన్నా పట్టింపు లేదా యేం పాడూ; ఛీ, యిదేం పొయ్యేకాలం – అయ్యో, యిదేం పాపకర్మంరా సుందరితండ్రీ."

"నీయిష్ట ప్రకారమేలే అమ్మ. ఎట్లా వాళ్లతో చెప్పటం?"

"పసివాడికిమల్లే అదేమిట్రా సుందరీ! ఏదో పెద్దవాళ్ళు మాటాడుకోకుండానే అయిందా ఇదంతా? అయిదువేలూ, పట్టుబట్టలూ, వెండిచెంబులూ ఆ వానపాములవాళ్ళు ఇస్తానన్నవేగా– అయినా మనమేమన్నా ఇందులో బావుకునేది వుంటుందా పాడా! ఆ ఖర్చూ యీ ఖర్చూ అంటూ అంతా పెళ్ళి ఖర్చుకింద చెల్లించుకునేదేగా. పదిమందితో కూడుకున్న పని వెలితయితే సిగ్గుచేటు కూడాను కర్మ! ఆ పిల్ల తండ్రి ఎట్లాగో వస్తాడు గనుక నువు మెదలకుండా వుండు– అయినా చిన్నకుంకలకేం దెలుసు పెళ్ళీ పేరంటమంటూను! మా నాయన యీ కాస్త మాటా దక్కించు."

తనమీద కొండంత ఆశ పెట్టుకున్న తన తల్లి కోరిక ఎట్లా కాదనగలడు సుందరం? లలితతో తన అవస్థ అతిదీనంగా చెప్పాడు సుందరం.

"మా అమ్మ కోరిక తీర్చంది ఎందుకు నా బతుకు?" అన్నాడు సుందరం.

"మీరు కొంచెం తొందర పడ్డట్టుంది" అన్నది లలిత తలవొంచుకుని.

"ఏ విధంగా?" అన్నాడు సుందరం ఆత్రుతగా.

'మీ అమ్మ మనస్సు గ్రహించకుండా తొందరపడి నాన్న స్థితికి ఆశ కలిగించారు."

''నువు అపార్థం చేసుకుంటావని నాకు తెలిసి మనస్సులో ఎంత బాధపడుతున్నానో నీకు ఎట్లా తెలుస్తుంది? ఇదిగో లలితా, కట్నం కోసం యీ పెళ్ళి జరగటంలేదని నువు మనస్ఫూర్తిగా నమ్మాలని నాకోరిక. ఇందుకు తార్కాణంగా అయిదువేలూ ఆరువేలూ కట్నాలిస్తామని వచ్చినప్పుడు నేను తిరస్కరించినట్టు మీరు విచారించి తెలుసుకోవచ్చు. ఏ అయిదారు వేలతోనో నా పెళ్ళి ఆర్భాటంగా చేసుకుందామని ముచ్చటపడుతున్న మా అమ్మ నువ్వంటే ఎంతో యిష్టంతో ఇప్పుడు రెండువేల అయిదువందలతోనే సంతృప్తి పడుతున్నది, పాపం. అమ్మను సంపూర్ణంగా తెలుసుకుని నువ్వు ఎంత ఆనందించగలిగేది నేనూహించగలను. నలుగురూ పెళ్ళిని గౌరవించాలని యీ కొద్ది కోరికతో పాపం ఆవిడ అమాయిక హృదయం ఎంత ఆరాటపడుతున్నదో నీ కెట్లా తెలుస్తుంది, లలితా? నిజానికి మన ప్రేమకు యీ చిన్న విషయాలు ఆటంకాలనుకుంటేనే ఆశ్చర్యం వేస్తుంది!"

"మీ అమ్మ ముచ్చట మా కుటుంబానికి ప్రాణసంకట మని మీకు తోచి వుంటుందనుకున్నా. మా అమ్మా నాన్నలకూ ముచ్చట్లున్నయిగాని యిప్పుడవి నా పెళ్ళి ఎంత హీనంగా జరిగినా తీరేట్టున్నయి. కనీసం ఏ అయిదారువందలకో తాహతున్నా నా పెళ్ళి ఎప్పుడో జరిగిపోయేదని అభిమానం చంపుకునికూడా మీతో చెప్పాడు నాన్న. మీరు నన్ను చూసే యిష్టపడి పెళ్ళి చేసుకుంటా నన్నందుకు ఎందుకో పట్టరాని సంతోషం వచ్చింది."

"ఇప్పుడుమటుకు నేను నిన్ను చూసి కాక యింకే వుద్దేశంతో పెళ్ళి చేసుకుంటున్నా ననుకుంటావు లలితా. నేను నిన్ను కోరేదల్లా అమ్మకోరికతో నన్ను అంటగట్టక మా యిద్దర్నీ ప్రత్యేక దృక్పథంతో గౌరవించమంటున్నా."

"నాన్న యీ పెళ్ళి ఆశ వొదులుకున్నాడు."

"యీ స్వల్ప విషయానికి-!"

"ఈ పెళ్లిళ్లు ఆడపెళ్ళిళ్ళేగాని ఆడామగ పెళ్ళిళ్లుగా లేవంటున్నాడు నాన్న."

"అంటే-?"

"అంటే ఏమీలేదు. పెళ్ళి ఉభయుల అవసరం అని. ఈ సారి పెళ్ళి ప్రస్తావన వస్తే తన కూతురికి కట్నమిస్తానని వొచ్చేవాడికితప్ప నన్నిచ్చి పెళ్ళిచెయ్యట్ట నాన్న."

"మీ నాన్న మాటలు సబబై నవనే అంటావా లలితా?"

"మా నాన్న మాట ఎట్టా కాదనను? నన్ను ఎంతో ప్రేమించి నా మేలు కోరతాడు నాన్న."

ఆ విధంగా తనకు లలిత దక్కకపోవటం అట్లావుంచి తరువాత ఒకటి రెండుసార్లు లలిత కనిపించినప్పుడు తననో జంతువును చూసినట్టుగా చూసినట్టని పించినందుకు గుండెలో ముల్లుకర్ర పెట్టి పొడిచినట్టయింది సుందరానికి.

"ఛీ. ఛండాలపు బతుకు- అని బిగ్గరగా చీదరించుకున్నాడు సుందరం" సాయంత్రం వారు వీరంటూ నదికి షికారువస్తారనే గమనికే లేకుండా.

"నువ్వంటున్న బతుకు అన్ని బతుకుల్లోకీ మహోత్కృష్టమైన బతుకుగా దార్శనికు లెప్పుడో నిర్ణయించారు' అన్నాడు ఆ వ్యక్తి. తనపక్కన ఎప్పుడు వచ్చి తెలియకుండా కూచున్నాడో కూచుని.

పడగమీద కొట్టినట్టయిన సుందరానికి ఆ కళ్ళజోడు నుదురు ప్రత్యక్షమయింది.

"పురాతన నిర్ణయాన్ని గురించి కాదులెండి యిప్పుడు మనం విచారించవలసింది' అన్నాడు సుందరం.

"నువు చదువుకున్నా వనుకుంటా?" అన్నాడు ఆ వ్యక్తి.

"తేడా ఏం లేదు" అన్నాడు సుందరం.

"ఇంకేం! అయితే యీనాడు మనం చదువంటే సంస్కృతని అర్థం చేసుకోవాలి- వాడు చదువుకున్న వాడంటే ఏం లాభం లేదు. ఎందుకంటే - లేకుంటే కొన్ని పక్షులకీ, మనకీ ఆట్టే తేడా వుండదు."

"అయితే మానవుడి జీవితం యీ నా డెందుకింత దౌర్భాగ్యంగా వుండాలి?"

"యజ్ఞపశు వంటే మీకు తెలుసనుకుంటా?"

"తెలుసు."

"అవి తాము మోక్షం పొందబోతున్నట్టు భావిస్తాయని కొందరు పెద్దలంటారు. బహుశా అంతేనేమో. అవుతే ఆ విషయం నిజం కాదని ఆ యజ్ఞపశువులకు అనిపిస్తేమటుకు మరుక్షణం కొమ్ములతో డొక్కల్లో పొడిచి పరుగెత్తుకువెళ్ళి యింత గడ్డి తింటూ తిరుగుతయి."

"అబ్బే, మీరేమిటో విషయంగాని విషయం మాట్టాడుతున్నారు" అవి మొహం తిప్పుకున్నాడు సుందరం.

**(ప్రచురించిన పత్రిక పేరు తెలియలేదు)**